క్లుప్తంగా

అనాథలు, దివ్యాంగులను ఆదరించాలి



అనాథబాలలతో సమితి సభ్యులు

ఏలూరు (టూటౌన్): అనాథలు, దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని రక్షణ సైన్యం ఏలూరు డీసీ జె.మేషే పిలుపునిచ్చారు. రక్షణ సైన్యం పాలగూడెంలోని గృహసమితి సభ్యుల ఆధ్వర్యంలో కరుణసమాజం పేరిట అనాతలు, దివ్యాంగులకు ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక గ్లేవియర్ నగర్ బ్యాంకు కాలనీ ఒకటో లైన్‌లోని విహాన్ చారిటబుల్ ట్రస్టులోని అనాథ బాలలు, చాటపర్రు రోడ్డులో ఉన్న బ్లెండ్ హోమ్‌లో పిల్లలకు ఆహారం అందించారు. కార్యక్రమంలో రక్షణ సైన్యం మేజర్ మేరీ కుమారి, పాలగూడెం కోర్ ఆఫీసర్ మేజర్ గేరా జాన్, మేజర్ రత్న మణి, గృహసమితి సభ్యులు పాల్గొన్నారు.

మా భూములు కొనుగోలు చేయండి



తహసీల్దార్ సోమశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న పోణంగి రైతులు

ఏలూరు రూరల్: జగనన్నకాలనీ పరిసర పంట భూములను ప్రభుత్వం కొనుగోలు చేయాలని పోణంగి రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జగనన్నకాలనీ అవసరాల కోసం రెండేళ్ల క్రితం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో భాగంగా కొంతమేరకు భూమి ప్రభుత్వానికి అమ్మేశామని తెలిపారు. మిగిలిన సుమారు 8 ఎకరాల భూమి సైతం నేడు ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వం మరోసారి భూ సేకరణ చేపడితే తప్పకుండా తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. సాగుకు ఇబ్బందుల్లేకుండా రోడ్డు, నీరు తదితర అవసరాలు కల్పిస్తామని తెలిపారు.

నేడు పబ్లిక్ హియరింగ్

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఎంఎస్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్‌పై పబ్లిక్ హియరింగ్ ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత పర్యవేక్షణలో నిర్వహించనున్నటుట ఏపీఓ కిషోర్ తెలిపారు. డ్వామా పీడీ, జెడ్పీసీఈఓ తదితర జిల్లా అధికారుల ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ సిబ్బంది పనులపై సమీక్ష నిర్వహించనున్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు



ఏలూరు (టూటౌన్): వలంటీర్లు సంక్షేమ వారధులుగా పనిచేస్తున్నారు. వారి సేవల కారణంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందుతోంది. ఆయా రంగాల ప్రజలు వలంటీర్ల సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కరోనా కష్ట కాలంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మాస్కులు, కూరగాయలు, అవసరమైన వారికి మందులు అందజేసిన విషయాన్ని నేటికీ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. కరోనా కట్టడికి వలంటీర్లు తమదైన శైలిలో పనిచేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి ప్రతి వ్యక్తీ కరోనా వ్యాక్సిన్ వేయించుకునేలా ప్రోత్సహించారు. కరోనా బాధితులను హోమ్ క్వారంటైన్, ఆస్పత్రులు, ప్రత్యేక శిబిరాలకు తరలించడంలో చురుకైన పాత్ర పోషించారు. వలంటీర్ సేవలకు వందనం అంటూ కొనియాడుతున్నారు.



కరోనా సమయంలో ఏలూరు వన్‌టౌన్‌లోని ఓ ఇంటి వద్ద జాగ్రత్తలు చెబుతున్న వలంటీర్ (ఫైల్)

వలంటీర్ సేవలతో మేలు



వలంటీర్ సేవలు అభినందనీయం. నిజంగా వారికిచ్చే కొద్దిపాటి పారితోషికంతో పనిచేయడం గొప్ప విషయం. వలంటీర్లు సమాజ సేవ చేస్తున్నారు. మా ఏరియా వలంటీర్ గౌతమి వల్ల మా ఇంట్లో వారికి పెన్షన్ అందుతోంది. ప్రభుత్వం అందించిన ఇంటి స్థలం అందింది. ఇదంతా వలంటీర్ సేవల వల్లే. మా ఇంట్లో వారు ఎవరి వద్దకూ వెళ్లకుండానే పథకాలు వచ్చాయి.

– బండ్లమూడి సునీల్, ఒన్‌టౌన్, ఏలూరు

పెన్షన్ వస్తోంది.. స్థలం మంజూరైంది



వలంటీర్ సేవలు ఎంతో భేష్‌గా ఉన్నాయి. గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా నాయకుల ఇళ్ల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. దానికి భిన్నంగా జగనన్న ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థలో అర్హతను బట్టి ప్రభుత్వ పథకాలు వాటంతటవే వస్తున్నాయి. మా వలంటీర్ నీలిమ నిరంతరం మా ఇంటికి వస్తూ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో మా ఇంట్లో పెన్షన్ వస్తోంది. ప్రభుత్వం అందించిన ఇంటి స్థలం మంజూరైంది.

– ఈదలాడ నాని, వన్‌టౌన్ దక్షిణపు వీధి,ఏలూరు

జగనన్నకు ధన్యవాదాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే గొప్పది. ఇంతటి గొప్ప వ్యవస్థను ప్రవేశ పెట్టిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు. మా వలంటీర్ రాజేష్ సొంతింటి మనిషిగా మాతో కలిసిపోయి ఎప్పటి కప్పుడు సంక్షేమ పథకాల గురించి వివరిస్తుంటాడు. వలంటీర్ కారణంగానే మాకు అమ్మఒడి పథకం వస్తోంది. కరోనా కష్ట కాలంలోనూ వలంటీర్ మాకు ఎంతో సహకరించారు.

– పిట్టా ధనుంజయ కుమార్, కుండీ సెంటర్, వన్ టౌన్, ఏలూరు

కారంచేడు మృతులకు ఘన నివాళి



మాట్లాడుతున్న ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): కారంచేడు మృతవీరుల 37వ సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక నరసింహారావుపేటలోని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్ కుమార్ మాట్లాడుతూ నాడు కారంచేడులో జరిగిన ఘటన బాధాకరమన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలో అత్యధిక జనాభా కలిగిన మాల, మాదిగలు మేల్కొని రాజ్యాంగం పట్ల తమకున్న హక్కులను తెలుసుకొని నేటి అన్యాయాలపై న్యాయబద్ధమైన పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దళిత మహాసభ సీనియర్ నాయకులు కొరబండి బాబూరావు మాట్లాడుతూ కారంచేడు ఉద్యమం నేటి ఉద్యమాలకు పునాదన్నారు. కార్యక్రమంలో పులవర్తి డేవిడ్, ప్రసాద్ రాజు, కనికెళ్ల రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి స్థాయి నుంచే మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించి తనను తాను తీర్చిదిద్దుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ రాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సెయింట్ థెరిస్సా ఇంటర్ కళాశాలలో 71వ విద్యార్థి సంఘ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెయింట్ థెరిస్సా వంటి ఉన్నత విద్యా సంస్థలో విద్యాభ్యాసం చేసే అవకాశం కలగడం విద్యార్థినుల అదృష్టమన్నారు. వ్యక్తిగత, వృత్తిపర జీవితానికి సమన్యాయం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నూతన అధ్యక్షులు పి.సౌమ్య, ఉపాధ్యక్షులు నిత్య జయకర్, ఇతర ఆఫీస్ బేరర్లకు బ్యాడ్జిలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకుల చే తమ విధులను సక్రమంగా నిజాయితీగా నిర్వర్తిస్తామని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మదర్ ఆర్నెస్టైన్, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదయాగనమిల్లిలో జగనన్న సురక్ష

ఏలూరు రూరల్: ఏలూరు మండలం పెదయాగనమిల్లి గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జగనన్న సురక్ష సభ నిర్వహించనున్నారు. మండల ప్రత్యేక అధికారి, డీఆర్వో ఏవీఎస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో అర్హులకు ధ్రువ పత్రాల మంజూరుతోపాటు సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ శ్యామ్ సుందర్

పెదపాడు: విద్యార్థులు ఇష్టంతో చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ సూచించారు. పెదపాడు మండలంలోని కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతులపై ఆయన ఆరా తీసారు. ఈకార్యక్రమంలో జగనన్న విద్యా కానుక పంపిణీ, పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంఈఓ డీవీ రమణ, ప్రధానోపాధ్యాయుడు కే. భీమయ్య పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



లబ్ధిదారులకు ధ్రువ పత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెదపాడు: పేదలకు సంక్షేమ పథకాలు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని పాత ముప్పర్రు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభు త్వం అందిస్తున్న 11 రకాలు ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు తమ అవసరాలననుసరించి ధ్రువపత్రాలను పొంది పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సచివాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, సర్పంచ్ కోట లలితకుమారి, ఎంపీటీసీ కర్రి అనీల్ కుమార్, తహసీల్దార్ జీ విజయ కుమార్ రాజు, వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, హౌసింగ్ ఏఈ చైతన్య పాల్గొన్నారు.

సురక్షతో సమస్యలు పరిష్కారం

దెందులూరు: జగనన్న సురక్ష కార్యక్రమంపై అందరి సమస్యలను శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎస్ఎస్ కృపావరం అన్నారు. సోమవారం దెందులూరులో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన దరఖాస్తుల ఆధారంగా 294 మందికి కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, సొసైటీ ఛైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీవీపీ లక్ష్మి, ఏపీఎం వేణుగోపాల్ అందజేశారు. కమ్యూనిటీ హాలు సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోకల రాంబాబు, కట్టా వెంకట సుబ్బారావు, చల్లా మేరీరాజు, కట్టా ఏసుబాబు, పులిపాటి శ్యామలాదేవి, వలంటీర్లు మొక్కలు నాటారు.

జగనన్న సురక్షలో ఉచిత సేవలు

పెదవేగి : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే గ్రామ సభలో 11 రకాల ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు ఉచితంగా అందిస్తున్నట్టు పెదవేగి ఎంపీపీ తాత రమ్య అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురంలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం 621 ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు పంపిణీ చేశారు. జగన్నాథపురం సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు, ఎంపీటీసీ రాచప్రోలు చంద్రరావు, ఎంపీడీవో జి రాజీమనోజ్ పాల్గొన్నారు. పెదవేగి మండలం నడిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ మేకా అప్పాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. విజయరాయి సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పెదబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెదవేగి మండల ఈఓఆర్‌డీ. బి శ్రీనివాసరావు, ఎంఈఓ అరుణ్, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్ మేక రమేష్, పాల్గొన్నారు.

రూ.1.23 కోట్ల వ్యయంతో పాఠశాల అభివృద్ధి



కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేసిన ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: రూ.1కోటి 23లక్షల వ్యయంతో పాఠశాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని, వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో 9 అదనపు తరగతి గదులు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. మరో రెండు తరగతి గదులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆహార పదార్థాలు మరింత రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలోని ఫౌండేషన్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఎమ్ఈఓ2 డీవీరమణ, స్థానిక నాయకులు కడిమి గోవిందరావు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, పేరెంట్స్ కమటీ ఛైర్మన్ పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతుల ఆగ్రహం

పెదవేగి : నాణ్యమైన ఆయిల్‌పామ్ గెలలను వేరు చేయకుండా వాటిని ఫ్యాక్టరీ తీసుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయిల్ పామ్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. పెదవేగిలోని ఏపీ ఆయిల్ఫెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రైతులు ఆందోళన నిర్వహించారు. ఆయిల్‌పామ్ గెలల నాణ్యత విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం, రైతులు మధ్య మాటామాటా పెరిగి, ఆందోళనకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆయిల్ పామ్ గెలలు దించుతుండగా అందులో పండని గెలలు వచ్చాయని చెప్పి కొన్నింటిని ఫ్యాక్టరీ ప్రతినిధులు వాటిని వెనక్కి పంపించేశారు. వాటిలో పండిన గెలలు కూడా ఉన్నాయని వాటిని తీసుకోవాలని రైతులు కోరారు. ఫ్యాక్టరీ ప్రతినిధులు మాత్రం దానికి ఒప్పుకోలేదు. ఫ్యాక్టరీ యాజమాన్యం తీరుతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ మేనేజర్ నారాయణబాబు, క్వాలిటీ అధికారి, శశిధర్ పచ్చి పండని గెలలను తీసుకునేది లేదని మరోసారి స్పష్టం చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని తెలుసుకున్న ఆయిల్ పామ్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి రైతులతో ఫోన్లో మాట్లాడి గెలలు నాణ్యతగా లేకపోతే నూనె దిగుబడి శాతం తగ్గిపోతుందని, ఆ ప్రభావం గెలల ధరపై పడుతుందని నచ్చచెప్పారు. గెలలు దిగుమతి విషయంలో హమాలీలు ఆలశ్యం చేస్తున్నారని, ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించడంతో రైతులు ఆందోళన విరమించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	100	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	40
పచ్చిమిర్చి	90	బీట్‌రూట్	40
కాకర కాయలు	60	కీరా దోస	48
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	188-260
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	20	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	28-36	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	116
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : ఏలూరుకు చెందిన శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు నూకల అమ్మాజి చిన వెంకన్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం రూ. 1,00,001 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేంద్ర త్రినాధరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు.

ప్రత్యేక డ్రైవ్‌తో మంచినీళ్ల ట్యాంకుల శుభ్రం

కామవరపుకోట : ప్రభుత్వ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి మహమ్మద్ రజవుల్లా జంగారెడ్డిగూడెం డివిజన్ కామవరపుకోట మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో క్లోరినేషన్ చేసి మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచినట్లు ఈవోపీఆర్‌డి జీడి శ్రీనివాసరావు తెలిపారు. వీటితోపాటు డ్రెయిన్‌లు శుభ్రపరచటం, దోమల నివారణకు మలాథియాన్, ఎబైట్ ద్రావణాలను పిచికారి చేయటం, ప్రత్యేక పారిశుద్య పనులు, మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

పోలవరం రూరల్ : వర్షాకాలంలో తాగునీటి వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని పోలవరం పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు తెలిపారు. దీనిలో భాగంగా పంచాయతీ పరిధిలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకులన్నీ శుభ్రం చేశారు. బీసీ కాలనీ, రామయ్యపేట ప్రాంతాల్లో ట్యాంకులో పేరుకుపోయిన నాచు, చెత్తను తొలగించామని, బ్లీచింగ్‌తో శుభ్రం చేసి క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. అలాగే డ్రెయిన్‌లు శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ కూడా చల్లిస్తున్నామన్నారు.

దంత కళాశాల విద్యార్థినుల ప్రతిభ



దంత విద్యార్థులను, ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న ఫాదర్లు

పెదవేగి : సెయింట్ జోసెఫ్ దంత కళాశాలను 2002లో స్థాపించామని ఎంతోమంది విద్యార్థులు దేశ విదేశాల్లో వైద్య సేవలు అందిస్తున్నారని కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాల్లోని దంత కళాశాలలో సోమ వారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ ఈ ఏడాది డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన పీజీ ఫైనల్ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థినులు షేక్ నజియా ఓవరాల్‌గా ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. మేరీ మనిషా రెడ్డి మూడో ర్యాంకు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ప్రిన్సిపాల్‌ను ఫాదర్ మోజెస్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. ప్రిన్సిపాల్ ఎన్ స్లీవరాజు, ఫాదర్ ధర్మరాజు, పీడీ నిట్టా నల్లయ్య పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లపై విజిలెన్స్ దాడులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని రెస్టారెంట్‌లపై సోమవారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు రెస్టారెంట్‌లలో దాడులు చేసి గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపారు. స్థానిక కృష్ణా ఫుడ్‌కోర్టు, రాఘవా రెస్టారెంట్‌లో దాడులు నిర్వహించి, గృహ అవసరాలకు వినియోగించే 15 గ్యాస్ సిలిండర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సిలిండర్‌లను గ్యాస్ ఏజెన్సీలకు అప్పగించారు. రెస్టారెంట్‌ల యజమానులపై నిత్యావసవ వస్తువుల చట్టం కింద కేసు నమోదు చేసేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ వైవీ లక్ష్మీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ నుంచి మినహాయించాలి

ఏలూరు (టూటౌన్): చేనేత రంగానికి సంబంధించి పట్టు నూలు రంగులపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని ఏపీ చేనేత కార్మి సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు ఒకప్రకటనలో కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత రంగంపై 2017లో జీఎస్టీ భారాన్ని మోపిందని, ఈ భారాలకు వ్యతిరేకంగా చేనేత కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గుజరాత్ వ్యాపారులు అడిగినదే తడవుగా సూరత్ జరీపై 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందని గుర్తు చేశారు. కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎంతో మంది పేదలకు జీవనాధారమైన చేనేతపై చిన్న చూపు చూడటం తగదని పేర్కొన్నారు.